విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :97 నల్గొండ బుధవారం 02-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## 'సిగాచీ' పేలుడు మృతులకు రూ.కోటి పరిహారం : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించి 45 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇంతటి ఘోర ప్రమాదం తెలంగాణలోనే కాదు, తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పటిదాకా జరగలేదన్నారు. మంగళవారం ప్రమాద స్థలిని పరిశీలించి, అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో 147 మంది ఉన్నారని, వారిలో 57 మంది సురక్షితంగా బయటపడ్డారని అధికారులు తెలిపినట్లు సీఎం చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో రెస్క్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాలని కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై ప్రభుత్వం తరపున మంత్రులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించనున్నారని చెప్పారు. తీవ్రంగా గాయపడి తిరిగి పనులు చేయలేని స్థితిలో ఉన్న బాధితులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించినట్లు సీఎం తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని చెప్పారు. మృతుల్లో తమిళనాడు, బీహార్, జార?ండ్ వాసులు అధికంగా ఉన్నారని వెల్లడించారు. మృతదేహాలను స్వస్థలాల తరలించడంలో ప్రభుత్వం



సాయపడుతుందన్నారు. మృతుల పిల్లల చదువులకు ప్రభుత్వం సాయం చేయనుందని సీఎం చెప్పారు. యాజమాన్యాలు ఇకనైనా కార్మికులు, ఉద్యోగుల భద్రతపై ఫోకస్ చేయాలన్నారు. ప్రమాదాలను నివారించాలని, ప్రమాదాలు జరగకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. నిర్లక్ష్యం ఉంటే కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ

## హిమాచల్‌లో వర్ష బీభత్సం.. నలుగురు మృతి, 16 మంది గల్లంతు

హిమాచల్‌ప్రదేశ్ , ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ఈ వర్షాలకు ఇప్పటి వరకూ మండి జిల్లాలో నలుగురు మరణించారు. కనీసం తొమ్మిది మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోగా.. 19 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. ఇక ఇప్పటి వరకూ 99 మందిని రక్షించినట్లు చెప్పారు. ఈ వర్షాలకు పది ఇళ్లు, 12 గోశాలలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. చండీగఢ్-మనాలీ హైవేలోని మండి-మనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడిన కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా మంగళవారం మండిలోని అన్ని విద్యా సంస్థలను అధికారులు మూసివేశారు. కాంగ్రా, సిర్మౌర్, సోలన్ జిల్లాల్లోని పాఠశాలలను కూడా మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. అంతేకాదు 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. ఇక ఈ సీజన్‌లో వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 23కి చేరుకున్నట్లు అధికారులు



తెలిపారు. పొరుగున ఉన్న ఉత్తరాఖండ్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈరోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. చమోలి, రుద్రప్రయాగ్, ఉత్తరకాశి, బాగేశ్వర్, పిథోరగఢ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో అనేక జిల్లాల్లో పాఠశాలలను మూసివేశారు. చమోలిలో జులై 1 నుంచి 1-12వ తరగతి వరకూ అన్ని తరగతులకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## పాశామైలారం మృతులు.. డీఎన్ఏ పరీక్షలకు ఏర్పాట్లు

హైదరాబాద్ : పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 45కు పెరిగింది. వారిలో కొందరి మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాంతో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద మరో 27 మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. %కాగా ప్రమాద స్థలాన్ని మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు కూడా సీఎం వెంట ఉన్నారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం చెప్పారు. మృతులకు ఫార్మా కంపెనీ రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని



అన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్, జూలై 1: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపల్ యాదారంకు చెందిన వీరస్వామి గౌడ్‌కు మంజూరైన రూ.45వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, తూంకుంట మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, తూంకుంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజు యాదవ్, నాయకులు గోనె హరిమోహన్ రెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ మండల్ యూత్ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, హనుమాన్ దాస్, తురాయి వెంకటేష్,యూసఫ్ బాబా పాల్గొన్నారు.



## సహజంగానే మనిషి ఆయుర్దాయం 150 నుంచి 200 ఏళ్లు : బాబా రామ్‌దేవ్

ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా అకాల మరణం తర్వాత యాంటీ ఏజింగ్ మందుల వాడకంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో యోగా గురు రామ్‌దేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. సహజంగానే మనిషి ఆయుర్దాయం 100 సంవత్సరాలు కాదని పేర్కొన్నారు. 150 నుంచి 200 ఏళ్లు జీవిస్తారని తెలిపారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాబా రామ్‌దేవ్ మాట్లాడుతూ.. 'మానవుడి సహజ ఆయుర్దాయం 100 ఏళ్లు కాదు. మనిషి సహజంగానే 150 నుంచి 200 ఏళ్లు జీవిస్తారు. కానీ మన మెదడు, గుండె, కాలేయంపై మనమే ఎక్కువ భారం మోపుతున్నాం. 100 ఏళ్లలో తినాల్సిన ఆహారాన్ని 25 ఏళ్లకే తినేస్తున్నాం. అందుకే ఈ పరిస్థితి. ఆహార క్రమశిక్షణ, మంచి జీవనశైలి చాలా అవసరం' అని చెప్పుకొచ్చారు. తనకు ప్రస్తుతం 60 ఏళ్లు అని, ఆహార నియమాలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు.ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా గత నెల 27న మరణించిన విషయం తెలిసిందే. ఆమె మరణానికి ముందు జరిగిన పరిణామాలపై పోలీసులు విచారణ జరిపారు. ఆమె మృతికి సంబంధించి పలు వివరాలను వెల్లడించారు. ఆమె యవ్వనంగా ఉండేందుకు పలు మాత్రలతో పాటు



ఇంజెక్షన్ తీసుకుంటూ వచ్చారన్నారు. జూన్ 27న ఇంట్లో పూజ సందర్భంగా ఉపవాసం ఉన్నారని.. కడుపు ఖాళీగా ఉండగా మందులు తీసుకోవడం బీపీ పడిపోయిందని ఉండవచ్చని.. దాంతో ఒక్కసారిగా సొమ్మసిల్లిపడిపోయారని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం ఆమె యవ్వనాన్ని కాపాడుకునేందుకు ఇంజెక్షన్ వేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. రాత్రి కూడా ఆమె సాధారణంగా తీసుకునే టాబ్లెట్లు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు.

## మేడిగడ్డ బరాజ్‌కు పెరుగుతున్న వరద

మహదేవపూర్, జూలై 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మహారాష్ట్రలోని ప్రాణహిత నది, తెలంగాణలోని గోదావరి నదుల ప్రవాహం గత వారం రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తోంది. రెండు నదుల ద్వారా సోమవారం బరాజ్ ఇన్‌ఫ్లో 8,400 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా, మంగళవారం బరాజ్ ఇన్ ఫ్లో 10,600 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బరాజ్ లోని మొత్తం ఎనిమిది బ్లాక్ లలో ఉన్న 85 గేట్లను ఎత్తి అంతే మొత్తంలో వరద ప్రవాహాన్ని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ లో ప్రస్తుత వరద ప్రవాహం సముద్ర మట్టానికి 89.40 మీటర్ల ఎత్తులో ఉన్నదని అధికారులు వెల్లడించారు. వర్షాల కారణంగా బరాజ్ కు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

మేడిగడ్డ బరాజ్‌లో క్రమం క్రమంగా వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో



గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి పరివాహక గ్రామాలైన అంబటిపల్లి, పెద్దంపేట, లెంకలగడ్డ తో పలు గ్రామాల ప్రజలకు అధికారులు పలు సూచనలు చేశారు. మెడిగడ్డ బరాజ్ లో గేట్లు అన్ని ఎత్తివేయడం జరిగిందని, గోదావరి లో జాలర్లు చేపలు పట్టేవారు, ఇతరులు ఎవరు నది వద్దకు వెళ్లకూడని, వరద ముంపు ప్రాంతాల వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

## అకస్మాత్తుగా 900 అడుగుల కిందకు దిగిన ఎయిర్ ఇండియా విమానం..

అహ్మదాబాద్‌లో గత నెల జరిగిన ఘోర విమాన ప్రమాదం యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ ఘటన జరిగిన రెండు రోజులకే మరో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఢిల్లీ నుంచి వియన్నా బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఒక్కసారిగా 900 అడుగుల కిందకు దిగింది. వెంటనే అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని నియంత్రణలోకి తెచ్చుకోవడంతో ఘోర ప్రమాదం తప్పినట్లైంది.

ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 777 %ూ×%-187 విమానం గత నెల 14వ తేదీన తెల్లవారుజామున 2:56 గంటలకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్ నుంచి వియన్నాకు బయల్దేరింది. టేకాఫ్



అయిన కొద్దిసేపటికే విమానం 900 అడుగుల కిందకు పడిపోయింది (%టశ్రీఅస్త్రష్ట్ జూశ్రీబఅస్త్రవస 900 టవవ్%). దీంతో వార్నింగ్ సిగ్నల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పైలట్లు భద్రతాపరమైన చర్యలు చేపట్టడంతో విమానం నియంత్రణలోకి వచ్చింది. అనంతరం విమానం వియన్నా ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విచారణకు ఆదేశించింది.

## ఉద్యోగులకు ఇన్ఫీ కీలక సూచన

దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పనిచేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో పని గంటలపై ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తాజాగా కీలక సూచన చేసింది. నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయొద్దని ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు ఈమెయిల్స్ ద్వారా సూచిస్తోంది. ఉద్యోగులు అదనపు పని గంటలు, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు సంస్థ గుర్తించింది. ఈ మేరకు ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ కీలక సూచన చేసింది. ఇన్ఫోసిస్ ప్రస్తుతం హైబ్రిడ్ పద్ధతిని అవలంభిస్తోంది. దీని ప్రకారం ఇన్ఫీ ఉద్యోగులు నెలకు పది రోజులు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. ఉద్యోగులు వారంలో ఐదు రోజులు.. రోజుకు సగటున 9:15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది.

అంతకంటే ఎక్కువ సమయం పనిచేస్తున్న వారిని హెచ్ఆర్ విభాగం గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఈమెయిల్స్ పంపుతోంది. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న వారికి ఏ రోజు ఎన్ని గంటలు పనిచేసిందీ ఈమెయిల్‌లో పేర్కొంటోంది. పనివేళలు ముగిసిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, పని మధ్యలో విరామం తప్పనిసరి అని ఆ మెయిల్స్‌లో సూచిస్తోంది. పని గంటల తర్వాత ఆఫీస్ పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తోంది. నారాయణమూర్తి వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యం, వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ఇన్ఫీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి : డీఈఓ మాధవి

సుల్తానాబాద్ రూరల్, జూలై 1 : విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో మంచరామి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం డీఈవో సందర్శించారు. పాఠశాల మరమ్మతు పనులను, కలర్స్ వేయడం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో మరమ్మతు పనులు చేసిన వారిని అభినందించారు. %మరోవైపు పిల్లల సంఖ్య పెరగడంతో డీఈఓ ఆనందం వ్యక్తం చేశారు. ఎంఈఓ ఆరెపల్లి రాజయ్యతో కలిసి డీఈఓ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే సుల్తానాబాద్ బుక్ స్టాల్ శ్రీనివాస్ విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ , పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గట్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపగ్రహం సాయంతో.. 5,000 కిలోమీటర్ల దూరం నుంచి సర్జరీ!

బీజింగ్: చైనా డాక్టర్లు అద్భుతం సృష్టించారు. ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వారు 5000 కిలోమీటర్ల దూరంలోని రోగులకు శస్త్రచికిత్స అందించారు. ఆరోగ్య సంరక్షణలో దీనిని విప్లవాత్మక పరిణామంగా భావిస్తున్నారు. ఈ శస్త్ర చికిత్సకు పీఎల్ఏ జనరల్ హాస్పిటల్ ప్రొఫెసర్ రాంగ్ లియూ నేతృత్వం వహించారు. ఈ వైద్య బృందం లాసాలో ఉండి రోబోల సాయంతో 5 వేల కిలోమీటర్ల దూరంలోని బీజింగ్‌లో ఇద్దరు రోగులకు సంక్లిష్టమైన కాలేయ శస్త్రచికిత్సలు నిర్వహించింది. ఉపగ్రహ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా ఎంతో సుదూర ప్రాంతంలో ఉన్న రోగులకు శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటిసారి. ఈ శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంతో ఇకపై మారుమూల ప్రాంతాలు, యుద్ధక్షేత్రాలు, విపత్తుల్లో చిక్కుకున్న ప్రదేశాల్లో కూడా ఈ పద్ధతుల్లో ఆపరేషన్ చేయవచ్చని ఆ వైద్య బృందం పేర్కొంది.

ఆపరేషన్ చేసిన విధానం

భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తున కక్ష్యలోని ఆప్‌స్టార్-6డీ ఉపగ్రహం సాయంతో 68 ఏండ్ల లివర్ క్యాన్సర్ రోగికి, 56 ఏండ్ల హెపటిక్ హెమాంగియోమా రోగికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ రెండు ఆపరేషన్లను కేవలం 105 నుంచి 124 నిమిషాల్లో ముగించారు. ఈ ఆపరేషన్లలో రోగులు కేవలం 20 మిల్లీలీటర్ల రక్తం మాత్రమే నష్టపోయారని, ఆపై వారిలో ఎటువంటి దుష్ప్రభావాలు కనిపించలేదని, 24 గంటల్లోనే వారిని ఇంటికి పంపించామని వైద్య బృందం తెలిపింది. లాసాలోని దవాఖానలో ఉన్న చీఫ్ సర్జన్ రోబోల సాయంతో ఈ ఆపరేషన్లు చేశారు. సర్జికల్ రోబోల ద్వారా ఇకపై 5000 కిలోమీటర్ల నుంచి 1.50 లక్షల కిలోమీటర్ల దూరంలోని రోగులకు సైతం ఆపరేషన్ చేయవచ్చని ఆ బృందం పేర్కొన్నది.

## సంపాదకీయం

**బుధవారం 02-07-2025**

# నానాకాలం చదువులు

'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడుబీ చుక్కా నడిచి పోదానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి. అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు. క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది. మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది. అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వేసవి సెలవులు కుదించుకుపోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లిదండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది. స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచర్' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది. విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షల్లో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది. పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే. ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేష మైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమని పించే మరో అధ్యాయం. చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో,

# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల సమస్య !

హైదరాబాద్,స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు లైన్ క్లీయర్ చేయడంతో పాటు, డెడ్‌లైన్ కూడా విధించింది. మరోవైపు 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసే ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్, బిజెపి డిమాండ్ చేస్తున్నాయి. కులగణన చేసి చరిత్ర సృష్టించామని, మోడీకి సవాల్ విసిరామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. స్థానిక ఎన్నికల్లో ఎలా అమలు చేస్తారన్నదానికి అసలు ప్రణాళిక ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్రం దీనికి ఆమోదం తెలిపితేనే ముందుకు సాగం సాధ్యం అవుతుంది. ఎన్నికలను 3 నెలల్‌ఓగా పూర్తి చేయాలని హైకోర్టు గడువు విధించడంతో బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర సర్కారు కసరత్తు చేయాల్సి ఉంది. ఎలా చేస్తే అడుగు ముందుకు పడుతుందో ఇప్పుడు సవాల్ కానుంది. కేంద్రాన్ని తిడుతూ పోతే సమస్య పరిష్కారం కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఉభయ సభల్లో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం ఇప్పటికే పంపించింది. ప్రస్తుతం ఈ రెండు బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఆమోదింప చేయాలని ఢిల్లీలో ధర్నా కూడా నిర్వహించారు. కిషన్‌రెడ్డి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అయితే బిసి కులగణన అంతా తప్పుల తడకగా ఉందని బిజెపి వాదిస్తోంది. మరోవైపు కేంద్రం చేసే గణనకే చట్టబద్ధత ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చి న హామీ మేరకు లేదా పదేపదే ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వమే 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశాన్ని ఎలా అమలు చేస్తారన్నది చూడాలి. ప్రస్తుతం ఎస్సీలకు 18, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తే మొత్తం రిజర్వేషన్లు 70 శాతం చేరే అవకాశం ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించరాదని ఇప్పటికే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అందువల్ల ప్రభుత్వ నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేస్తే మొత్తం ఎన్నికల పక్రియ నిలిచిపోయే ప్రమాదం ఉన్నది. అలాంటప్పుడు కేంద్రం అంగీకరించకుండా 42శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదు. అది కాకుంటే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కూడా సాధ్యం కావు. అందువల్ల పార్టీ పరంగా 42శాతం బిసి రిజర్వేషన్లు ఇస్తామనే ప్రకటన చేయడం మినహా మరోమార్గం లేదు. బిసి రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తమిళనాడుకు కల్పించినట్లే తమకు రక్షణ కల్పించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నది. కానీ కేంద్రం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం మించరాదనే సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. దీంతో కోర్టు తీర్పులు, రాజ్యాంగ నిబంధనలులాంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును గత మార్చిలోనే అసెంబ్లీ అమోదించింది. కానీ బీసీ రిజర్వేషన్ల పెంపు రాష్ట్ర పరిధిలో తీసుకునే నిర్ణయం కాకపోవడంతో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ప్రస్తుతం ఇది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇప్పటివరకూ రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ



విషయంలో న్యాయ నిపుణులను సంప్రదించి, ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంపైనా ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది. అయితే రాజ్యాంగ పరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తరవాతే రాష్ట్రపతి ఆఓదం తెలుపుతారు. కాబట్టి ఇలాంటి విషయాల్లో రాష్ట్రపతి కూడా న్యాయ సలహాకు పంపుతారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే జీవో ఇవ్వడం సాధ్యమువుతందా అన్న విషయం కూడా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఇలా చేయడం వల్ల వచ్చే న్యాయపరమైన చిక్కులపైనా ప్రభుత్వం ఆరా తీస్తున్నది. నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో అంటే ఈ మూడు నెలల్లో కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రాకపోవచ్చు. అందువల్ల పార్టీపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి.. ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం. మరోవైపు హైకోర్టు తీర్పు తరవాత పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే హైకోర్టు తీర్పు తర్వాత సీఎస్ రామకృష్ణారావును పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులోని అంశాలను వివరించారు. రిజర్వేషన్లపై క్లారిటీ వస్తే.. వెంటనే ఎన్నికల పక్రియ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి సీఎస్ రామకృష్ణారావు వివరించినట్లు తెలిసింది. రిజర్వేషన్ల బిల్లుపై రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఆమోదం రాకుంటే తమిళనాడు తరహాలో సుప్రీంకోర్టు మెట్లెక్కాలని కొందరు సూచించినట్లు సమాచారం. మరోవైపు తెలంగాణలో కులగణన, ఇక్కడి నుంచి వెళ్లిన రిజర్వేషన్ల బిల్లులపై కేంద్రం పెద్దగా స్పందించడం లేదు. సానుకూలతనూ వ్యక్తం చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్రం జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. సమగ్ర కులగణన సర్వే వివరాలు, అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు ఆధారంగా నేరుగా బీసీలకు నేరుగా 42 శాతం రిజర్వేషన్లను ప్రకటిస్తే వచ్చే న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో.. ప్రభుత్వం ఏం చేస్తుందన్న చర్చ సాగుతోంది. ఓ రకంగా ఇది అంత సులవైన విషయం కాదు. ప్రభుత్వ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది.

# మున్సిపల్ శాఖలో 3వేల కోట్లు పక్కదారి

నెల్లూరు, గత వైకాపా ప్రభుత్వం మున్సిపల్ శాఖకు చెందిన రూ.3 వేల కోట్లను పక్కదారి పట్టించిందని మంత్రి నారాయణ విమర్శించారు. రాష్ట్రంలో డ్రెయిన్ల పనులన్నీ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. నెల్లూరు నగరం 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నెల్లూరులోని 6.7 కిలోమీటర్ల పరిధిలోని కాలువలన్నింటిలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు (అరజీనిటసజీశిజీబీ) అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైకాపా ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లల కోసం సిద్ధమైన వీఆర్ హైస్కూల్‌లో ఈరోజు నుంచి తరగతులు ప్రారంభిస్తున్నామని నారాయణ తెలిపారు.

# రైతులందరికీ కిసాన్ పథకం

న్యూఢిల్లీ, దేశంలో 90 కోట్లకు మించి రైతు కుటుంబాలు వున్నట్లుగా ఓ అంచనా ఉంది. ప్రధాని కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు సమాన వాయిదాల్లో రూ. 6000 నగదు ఇచ్చే పథకం అమలు చేస్తున్నారు. అయితే కేవలం 10.74 కోట్ల కుటుంబాలకే ఇది అందుతున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేవలం 10 శాతం రైతు కుటుంబాలే ఈ కనీస లబ్దిని పొందుతున్నాయి. 2016లో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పరిమిత సంఖ్యలోని రైతులకే వర్తిస్తున్నది. రైతుల కోసం ఉద్దేశించిన 17 పథకాలకు 202021 ఆర్థిక సంవత్సరంలో రూ. 17,540 కోట్లు కేటాయించగా, అందులో రూ. 5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే మొత్తం బడ్జెట్ కేటాయింపులో 33శాతం మాత్రమే ఖర్చు అయింది. ఇందులో మూడు పథకాల కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని సమాచారం. రైతు సంక్షేమం కోసం ఆచరణలో ఇంత తక్కువ స్థాయి కృషి జరుగుతున్నప్పుడు వారి ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందో అర్థం కాని విషయం. 2019లో దేశ వ్యాప్తంగా కనీసం 5,957 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకి సగటున 16 మంది రైతులు ప్రాణత్యాగం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014 నుంచి 2020 వరకు గల ఆరు సంవత్సరాల్లో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా జరిగినట్టు వెల్లడైంది.దీనిపై కారాణాలు వెతికి ఆత్మహత్యలను నిర్మూలించే చర్యలకు ఉపక్రమించడం లేదు. దీంతో వ్యవసాయంలో కాలం కలసిరాకనో..పంటలు పండినా మద్దతుధరలు లేకనో..చేసిన అప్పులు తీర్చలేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీటిపై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది.

# మన ఆడోళ్లు దాచిన బంగారమంత కాదు పాకిస్తాన్ బతుకు..



న్యూఢిల్లీ,మన ఇళ్లలోని బంగారం విలువ ఎంతో తెలిస్తే ఆశ్చర్య పోతారు. ప్రపంచం మొత్తం దగ్గరున్న బంగారంలో మనదగ్గరున్న శాతమెంతో తెలిస్తే షాకవుతారు. మనదసలు ఉట్టి ఇటుకల ఇల్లు కాదు.. బంగారు ఇల్లు. గోల్డెన్ హోం. అందుకు కారణమేంటి? ప్రపంచ ప్రైవేటు గోల్డ్ ప్రాపర్టీలో మనమె ందుకంత ముందంజలో ఉన్నాం. ఆ డీటైల్స్ ఏంటి? ఇప్పుడు చూద్దాం.

భారత్ ఇంటింటి బంగారం

భారతదేశంలో ఇంటింటి బంగారం విలువ పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కంటే ఆరు రెట్లు పెద్దది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల గృహ సంపదకన్నా కొన్ని వందలు వేల రెట్లు ఎక్కువ. దేవాలయాలతో సహా భారతీయ కుటుంబాల సమిష్టి సంపద విలువ 25 వేల టన్నులు. దీని విలువ మార్కెట్లో 2. 4 ట్రిలియన్లుగా అంచనా వేసింది వరల్డ్ గోల్డ్ కౌన్సిల్. ఇది మన 2026 ఫైనాన్షియల్ ఇయర్ లో 56 శాతంగా అంచనా.

2. 4 ట్రిలియన్లు- %ఔ+జ

2025 ఫైనాన్షియల్ ఇయర్ కోసం ఐఎంఎఫ్ ఒక అంచనా వేసింది. దీని ప్రకారం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ 411 బిలియన్ డాలర్ల విలువైంది. అయితే భారతదేశంలోని ప్రైవేటు బంగారు నిల్వల మొత్తం ఎంతని చూస్తే ఇది పాకిస్థాన్ జీడీపీ కంటే ఆరు రెట్లు అధికంగా కనిపిస్తోంది. కేవలం పాకిస్తాన్ మాత్రమే కాదు.. 2. 4 ట్రిలియన్ డాలర్ల ఇటలీ, 2. 3 డాల్ల కెనడా జీడీకన్నా ఎక్కువే.

2026 నాటికి ఔన్సు ధర 3500 డా. కి పెరుగుదల

యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ ప్రకారం.. 2020 నాటి కాలం నుంచి బంగారం ధరలు ఎక్కువయ్యాయి. ఇది భారతీయ గృహ సంపదను మరింత పెంచినట్టు తెలుస్తోంది. వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, రాజకీయ పరిణామాలు, ఇంకా ఎన్నో అనిశ్చితుల కారణంగా 2026 నాటికి బంగారం ధరలు ఔన్సుకు 3500 డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది స్విస్ బ్యాంక్. 2026 ఆర్థిక సంవత్సరానికిగానూ.. భారత్ లో బంగారం పరిమాణం విషయంలో డిమాండ్ తగ్గుతుందని.. యూబీఎస్ అంచనా వేసినప్పటికీ.. అధిక ధరలు నికర దిగుమతులను 55- 60 బిలియన్ డాలర్లకు చేర్చుతాయని తెలుస్తోంది. ఇది జీడీపీలో 1. 2 శాతంగా ఉండటం విశేషం.

ఇది గతం కంటే 15 శాతం ఎక్కువ

ప్రజెంట్ గోల్డ్ రేట్స్ రికార్డులు తిరగరాస్తున్నాయి. అయినా సరే ప్రస్తుతం బంగారం డిమాండ్ ఏమంత తగ్గలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ 782 టన్నులు కాగా.. ఇది గతం కంటే 15 శాతం ఎక్కువ. ఆభరణాల డిమాండ్ అయితే కాస్త తగ్గిన మాట నిజం. బంగారు కడ్డీలు, నాణేలలో రిటైల్ ఇన్వెస్ట్ మెంట్ 25 శాతం పెరుగుదల కనిపిస్తోంది. 2024 మధ్య కాలంలో కస్టమ్స్ సుంకం 15 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గింది.

2027 నాటికి ఈ డిమాండ్ 800 టన్నులకు డిమాండ్

2026 నాటికి హౌస్ హోల్డ్ డిమాండ్.. 725 టన్నులకు తగ్గుతుంది. 2027 నాటికి ఈ డిమాండ్ 800 టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తోంది యూబీఎస్. ఈ రికవరీ వెనక కేంద్ర వేతన పెరుగుదల ఉండొచ్చని అంటున్నారు. ఈ మొత్తం విలువ 55 బిలియన్ డాలర్లు. ఇది పొదుపును పెంచుతుంది. దీంతో ఇటు రియల్ ఎస్టేట్ అటు గోల్డ్ ఇన్వెస్ట్ మెంట్ లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఏర్పడుతుంది. అందుకే 2027 నాటికి బంగారం కొనుగోళ్లు పెరుగుతాయని అంటోంది స్విస్ బ్యాంక్.

మనం తాకట్టు పెడుతోన్న బంగారం 2 శాతం మాత్రమే

భారత్ బంగారు నిల్వలు ఆకట్టుకునేలా ఉన్నప్పటికీ ఈ సంపద ద్వారా మనీ జనరేట్ చేసే యత్నాలు చాలా వరకూ తగ్గాయి. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ విభాగంలో విస్తరించడానికి ప్రయత్నించినప్పటికీ.. గృహ బంగారంలో 2 శాతంకన్నా తక్కువ రుణాలకు పూచీకత్తుగా వాడుతున్నట్టు చెబుతోంది స్విస్ బ్యాంక్. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, చోళ వంటి సంస్థలు గోల్డ్ లోన్స్ ఇస్తున్నాయి. అయితే బంగారు ఆభరణాల పై ఉన్న మోజు.. గోల్డ్ బాండ్స్, గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్స్ ని దెబ్బ తీసినట్టుగా చెబుతారు. అందుకు 2024లో సావరిన్ బాండ్స్ నిలిపివేతే అతి పెద్ద ఉదాహరణగా చెబుతోంది స్విస్ బ్యాంక్. బంగారం ధర ఎప్పుడైతే పెరుగుతూ వెళ్తుందో.. ఇది ప్రభుత్వానికి భారమయ్యే అవకాశముంది. అందుకే ఇలా చేసినట్టు చెబుతున్నారు నిపుణులు. బంగారం దిగుమతి భారం ఎక్కువగా ఉన్నప్పటికీ.. భారత్ కరెంటు ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రపంచ ప్రైవేటు బంగారు నిల్వలో 14 శాతం భారత్ లో

ప్రపంచంలోని ప్రైవేటు బంగారు నిల్వలో 14 శాతం భారత్ లోనే ఉంది. ఇది అతి పెద్ద ప్రైవేట్ గోల్డ్ ప్రాపర్టీగా భావిస్తున్నారు. స్విస్ బ్యాంక్ చెప్పినట్టు బంగారంతో భారతీయ కుటుంబాలకు అతి పెద్ద ఎమోషనల్ బాండింగ్ ఉ ంటుంది. ఇక్కడ ఎంత బంగారముంటే అంత గొప్ప. సరిగ్గా అదే సమయంలో వారినీ అలవాటు సంపన్నులుగా మార్చుతోంది. బంగారం అంటే లక్ష్మీదేవితో సమానమని.. బంగారు నిల్వలు ఎంతగా ఉంటే తమ చెంత అంతటి లక్ష్మీకటాక్షం ఉన్నట్టు భావిస్తారు కాబట్టి.. భారతీయ కుటుంబాలకూ బంగారానికీ ఒక విడదీయరాని అనుబంధంగా మారింది పరిస్థితి.

భారత్‌లో బంగారం అదో ఎమోషన్

మన ప్రాంతంలో నీ ఇల్లు బంగారం కాను.. అంటారు. కారణం.. ఇక్కడ బంగారమంటే అదో ఎమోషన్. ప్రతిదానికీ బంగారం లాంటి మనిషి, బంగారు కొండ.. ఇలా రకరకాల విశేషణాలు అల్లుకుని కనిపిస్తాయి. సరిగ్గా అదే సమయంలో.. ఇక్కడ బంగారానికి దేవతా ఆచ్ఛాదన కూడా ఉండటంతో.. ఇక్కడ గోల్డ్ మీన్స్ గాడ్ కింద లెక్క.

బంగారు నిల్వ చేయడం భారత్ సంప్రదాయం

గోల్డ్ ఇన్వెస్ట్ మెంటే కాదు- సెంటిమెంటు కూడా..భారతదేశానికి బంగారానికి ఉన్న అనుబంధం.. మాటల్లో వర్ణించలేనిది. ఇక్కడ స్వర్ణంగా పిలిచే బంగారం నిల్వ చేయడం ఒక సంప్రదాయం. మరీ ముఖ్యంగా ఆడపిల్లలను బంగారు ఆభరణాలతో ముంచెత్తాలని అనుకుంటారు. అంతే కాదు ఎవరికి ఎంత బంగారముంటే వారికి అంతటి సామాజిక గౌరవం విలువ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఏదైనా పెళ్లి పేరంటాలపుడు ఇక్కడి మహిళలు బంగారు ఆభరణాలను ధరించడం ద్వారా తమ హోదాను ప్రదర్శిస్తుంటారు.

బంగారం ఒక శుభప్రదంగా భావన

మరీ ముఖ్యంగా హిందూ సంప్రదాయంలో బంగారం ఒక శుభ ప్రదమైన భావన. ఇక్కడ ఏదైనా సరే బంగారంతో ఉంటే దాన్నొక దైవంగా భావిస్తుంటారు. ఆ మాటకొస్తే మన ఇళ్లు వాకిళ్లూ ఇంకా దేవాలయాలు ఇలా అన్నింటా బంగారం ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటుంది.

బంగారు వాకిలి, బంగారు కిరీటాలు, గోపురాలు, రథాలు..

బంగారు వాకిలి అంటూ మన ఆలయ వ్యవస్థలో బంగారం అతి పెద్ద పాత్ర పోషిస్తూ ఉంటుంది. ఇక బంగారు కిరీటాలు, గోపురాలు, రథాలు అంటూ బంగారం వాడకం విలువ అధికంగా కనిపిస్తుంది. అంటే ఆయా దేవీ దేవతలు సైతం.. ఎంత ప్రముఖమైన వారో తెలియ చేసేది ఈ బంగారమే. ఆ మాటకొస్తే గోల్డెన్ టెంపుల్ కల్చర్ భారత ఆధ్యాత్మిక విభాగంలో ఒక భాగం.

# భారీ ఊరట..

అమెరికా,అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు ఇది నిజంగా ఒక శుభవార్త! అమెరికా సెనెట్ తాజాగా ప్రతిపాదించిన ముసాయిదా ప్రకారం.. రిమిటెన్స్ ట్రాన్స్‌ఫర్ టాక్స్‌ను గణనీయంగా తగ్గించారు. ఇదివరకు ఉన్న 3.5 శాతం నుండి కేవలం 1 శాతానికి ఈ పన్నును తగ్గించడం ద్వారా భారతదేశానికి నిత్యం డబ్బులు పంపే ఎన్ఆర్ఐలకు భారీ ఊరట లభించనుంది.

ట్రంప్ బిల్‌లో కీలక మార్పులు

ఈ ముఖ్యమైన సవరణలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన "వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్" ముసాయిదాలో భాగంగా తీసుకొచ్చారు. తొలుత హౌస్‌లో 5 శాతం రేటును ప్రతిపాదించగా.. తరువాతి దశలో దానిని 3.5 శాతానికి తగ్గించారు. ఇప్పుడు సెనెట్ విడుదల చేసిన ముసాయిదాలో ఈ పన్ను రేటును ఏకంగా 1 శాతానికి తగ్గించడం విశేషం.

ఈ టాక్స్ ఎవరికి వర్తిస్తుంది?

గ్రాంట్ థార్న్టన్ భారత్‌లో యుఎస్ టాక్స్ పార్ట్‌నర్ అయిన లాయిడ్ పింటో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ టాక్స్ డబ్బు పంపకాల్లో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వర్తిస్తుంది. అవి ఏంటంటే..క్యాష్ ద్వారా పంపిన ట్రాన్స్‌ఫర్‌లకు అంటే, నగదు రూపంలో చేసే బదిలీలకు వర్తిస్తుంది.. మనీ ఆర్డర్, క్యాషియర్ చెక్ లేదా ఇతర ఫిజికల్ పేమెంట్ టూల్స్ ద్వారా పంపే పంపకాలకు ఇది వర్తిస్తుంది. భౌతికంగా చేసే చెల్లింపు సాధనాల ద్వారా జరిగే లావాదేవీలకు మాత్రమే ఈ టాక్స్ వర్తిస్తుంది.అయితే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికాలోని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల ఖాతాల్లో ఉన్న డబ్బుల ద్వారా జరిపే ట్రాన్స్‌ఫర్లు, లేదా అమెరికా జారీ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే ట్రాన్స్‌ఫర్లు ఈ టాక్స్‌కు లోబడి ఉండవు.

ఎప్పుడు అమల్లోకి వస్తుంది?

ఈ కొత్త రిమిటెన్స్ టాక్స్ నిబంధనలు 2025 డిసెంబరు 31 తర్వాత అమలులోకి వస్తాయి. ఈలోగా సెనెట్ ఈ బిల్లును జూలై 4వ తేదీలోగా ఆమోదించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్ఆర్ఐలకు గొప్ప ఊరట

ఈ నూతన ముసాయిదా ప్రవాస భారతీయులకు ఎంతగానో ఉపశమనంగా మారనుంది. ఎందుకంటే వారు తమ కుటుంబ సభ్యులకు డబ్బు పంపేటప్పుడు బ్యాంకు ఖాతాలు లేదా కార్డులు ఉపయోగిస్తే టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది ముఖ్యంగా చిన్న మొత్తాలను తరచుగా పంపేవారికి.. అధిక సంఖ్యలో ఎన్ఆర్ఐలకు భారీ ఉపశమనాన్ని కలిగిస్తుంది. అమెరికాలో ఎన్ఆర్ఐలు ఎక్కువగా డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారానే డబ్బు పంపడం వల్ల, ఇది వారందరికీ నిజంగా ఒక పెద్ద రిలీఫ్ అని చెప్పొచ్చు.ఈ బిల్లు ఆమోదంతో ప్రవాస భారతీయులు తమ కష్టార్జితాన్ని స్వదేశానికి మరింత సులభంగా.. తక్కువ పన్ను భారంతో పంపగలుగుతారు.

# టెంపో ట్రావెల్‌ను ఢీకొన్న లారీ..ముగ్గురు దుర్మరణం

చిత్తూరు,అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్న బావి వద్ద టెంపో ట్రావెల్ ను లారీ ఢీకొట్టింది. తిరుమల నుంచి కర్ణాటక బాగేపల్లి వెళ్తున్న టెంపో ట్రావెల్ ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, 9 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతి చెందిన వారు చరణ్, మేఘర్ష్, శ్రావణి గా గుర్తించారు. డ్రైవర్ మంజునాథ్ తో సహా మరో 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదఘటన పై ముదివేడు పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలి

విజయవాడ,క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. 1990లలో ఇంటర్నెట్ వల్ల ప్రపంచం ఓ గ్లోబల్ విలేజ్‌గా మారిందని ఉద్ఘాటించారు. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలని సూచించారు. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారిందని వెల్లడించారు. క్వాంటమ్ వ్యాలీపై విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 1995 టెక్నాలజీ రివెల్యూషన్‌ను ఇండియా పొందింది.. దానిలో తన పాత్ర కూడా ఉందని గుర్తుచేసుకున్నారు సీఎం చంద్రబాబు. ఏపీకి ఎన్నో అడ్వాంటేజీలు ఉన్నాయని.. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ఇక్కడే ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఏపీ గ్రీన్ ఎనర్జీలో చాలా బలంగా ఉందని చెప్పారు. 1989లో కుప్పం నుంచి పోటీచేస్తూ ఒక పబ్లిక్ మీటింగ్‌లో తాను ఎలక్ట్రానిక్ ఎక్సేంజ్ తెస్తానని చెప్పానని.. అయితే ఆ విషయంతో తన ప్రత్యర్థులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ సర్వీసులు అన్నిసేవలను ఆగస్టు 15వ తేదీ నాటికి వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జనవరి ఒకటోవ తేదీ నాటికి క్వాంటవ్‌ు కంప్యూటింగ్ సెంటర్ అమరావతి నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. దీనికోసం ఎకో సిస్టంతో పాటు యూజ్ కేస్‌లు కూడా రావాలని సూచించారు. టాప్ ఏఐ యూసేజ్‌లో చైనా, యూఎస్, ఇండియా మాత్రమే ముందు ఉన్నాయని వివరించారు. టిసీఎస్ మనతో ముందునుంచి ట్రావెల్ చేస్తోందని.. ఇప్పుడు డేటాలింక్‌పై పనిచేస్తుందని చంద్రబాబు వెల్లడించారు. 'నిజానికి క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేయాలనుకున్నాం. దీనిపై ముఖ్యమైన వ్యక్తులను ఆహ్వానించాలనుకున్నాం. ఆ సమయంలోనే భారత ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్‌ను అనౌన్స్ చేసింది. వెంటనే కామకోటి మా వద్దకు వచ్చి ఈ విషయం చెప్పారు. వెంటనే నేను కేంద్ర ప్రభుత్వాన్ని అడిగా... వారు ఓకే చెప్పారు. ఎలా ముందుకు వెళ్లాలని కూడా అడిగాం. ఈ రంగంలో మరింతమంది ముందుకు రావాలని ఎకో సిస్టంను టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ ద్వారా చేయగలిగాం. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టం క్రియేట్ చేయాలి. ఐటీని నేను 1983-84లోనే అప్లైడ్ చేశాను. లోకేష్ పుట్టిన సమయం అది. దానిలో భాగంగా నేను అమెరికా వెళ్లాను.... మైక్రోసాఫ్ట్‌తో పాటు అన్ని నగరాలు తిరిగి ప్రయత్నం చేశాను. బ్రిటిష్ వాళ్లు మన కోహినూరు డైమెండ్‌ను తీసుకుపోయినా.. ఇక్కడ ఇంగ్లీష్ వదిలి వెళ్లారు. నేను అమెరికా నుంచి తిరిగి రాగానే అనేక ఇంజనీరింగ్ కాలేజ్‌లు ప్రారంభించి ఐటీ ఎడ్యూకేషన్‌ను పెంచాను. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారింది.

## చెంపదెబ్బ తిన్నా.. బుద్ధిమారని పాకిస్తాన్?

జమ్మూ కాశ్మీర్: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ నిర్వహించిన తీవ్ర దాడుల అనంతరం పాకిస్తాన్ మళ్లీ తన ఉగ్రశిబిరాల పునర్నిర్మాణాన్ని ప్రారంభించిందని రహస్య సమాచారం వెల్లడిస్తోంది. మేలో భారత్ చేసిన అత్యంత ఖచ్చితమైన వైమానిక దాడుల సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని పలు శిబిరాలు ధ్వంసమయ్యాయి. అయితే ఇప్పుడు పాక్ ఆర్మీ, , ప్రభుత్వ సహకారంతో కొత్తగా ఇవే శిబిరాలు తిరిగి నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమం ఖచ్చితమైన ప్రణాళికతో, ఉగ్రతత్వాన్ని కొనసాగించే సంకల్పంతో కొనసాగుతోంది. భారత గూఢచార సంస్థల విశ్లేషణల ప్రకారం, తాజాగా నిర్మించబడుతున్న శిబిరాలు అధునాతన సాంకేతికతతో కూడినవి. ఇవి ప్రధానంగా లైన్ ఆఫ్ కంట్రోల్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్నాయి. శాటిలైట్‌లు, డ్రోన్ల పర్యవేక్షణకు చిక్కకుండా ఉండేందుకు వీటినిదట్టమైన అడవుల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. పాక్ సైన్యం ప్రత్యేక విభాగాల ఆధ్వర్యంలో ఈ శిబిరాలకు భద్రత కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. థర్మల్ సెన్సార్లు, తక్కువ ఫ్రీక్వెన్సీ రాడార్‌లు, డ్రోన్ కౌంటర్‌మెజర్లతో సాయుధ గార్డులు వీటిని కాపాడుతున్నారు. అయితే గతంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు, ఈసారి ఐఎస్?ఐ బాగానే పన్నాగం వేసింది. పెద్ద శిబిరాలను ఇప్పుడు చిన్నచిన్న శిబిరాలుగా విభజన చేసింది. ఒక్కో శిబిరంలో 200 మందికి మించి ఉగ్రవాదులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చిన్న శిబిరాలు దాదాపు 20 ప్రదేశాల్లో నూతనంగా నిర్మాణంలో ఉన్నాయి. కేల్, సర్ది, అత్ముకాం, జూరా, లిపా, కహూటా, కోట్లీ, ఖుయిరట్టా, చమన్‌కోట్, జంకోట్ వంటి ప్రాంతాలు వీటిలో ప్రముఖమైనవి. గతంలో ధ్వంసమైన లునీ, పుట్వాల్, చాప్రార్ ఫార్వర్డ్, జంగ్లోరా వంటి ప్రాంతాల్లోనూ పునఃనిర్మాణంజరుగుతోంది. ఇక బహావల్పూర్‌లో ఇటీవల జరిగిన ఒక రహస్య సమావేశాన్ని కూడా భారత నిఘా సంస్థలు గుర్తించాయి. ఈ సమావేశానికి జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ టెర్రరిస్ట్? రెసిస్టెన్స్? ఫ్రంట్ వంటి ఉగ్రవాద సంస్థల నేతలు హాజరయ్యారు. ఐఎస్?ఐ ఉన్నతాధికారులు కూడా ఇందులో పాల్గొన్నట్లు సమాచారం. ఇందులో ముఖ్యంగా కొత్త కమాండ్ శ్రేణుల ఏర్పాటు, మళ్లీ శిక్షణా శిబిరాల నిర్మాణం, పాక్, కశ్మీర్ ప్రాంతాల్లో నియామకాలపై చర్చించారని తెలుస్తోంది. బహావల్పూర్ జైష్ ఉగ్రసంస్థకు కేంద్రంగా ఉండటంతో అక్కడ నిర్వహించిన ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్తాన్, మరోవైపు ప్రపంచ బ్యాంకు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ల నుండి వచ్చిన నిధులను కూడా ఈ ఉగ్ర శిబిరాల నిర్మాణానికి మళ్లిస్తున్నదని భారత రహస్య సంస్థలు పేర్కొంటున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అందుకే భారత్ అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉండగా, ఆపరేషన్



సిందూర్ వివరాలను పరిశీలిస్తే.. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు మృతిచెందిన తర్వాత భారత ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలనే దృఢనిశ్చయంతో ఈ ఆపరేషన్ ప్రారంభించింది. మే 6వ తేదీ నుండి నాలుగు రోజులపాటు జరిగిన ఈ సర్జికల్ దాడుల్లో భారత వైమానిక దళం కీలకపాత్ర పోషించింది. చైనా నుంచి పాక్‌కు వచ్చిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ముందుగానే అడ్డుకుని, 23 నిమిషాల్లో లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులు జరిపింది. ఇస్రో ఉపగ్రహాల సహాయంతో ఉగ్రవాద స్థావరాలపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించి, ఆయా టార్గెట్లను గుర్తించి, అధునాతన ఆయుధాలతో పక్కాగా గురిచూసి దాడి నిర్వహించారు. మురిద్కేలోని మర్కజ్ తాయిబా, బహావల్పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా వంటి ప్రముఖ శిక్షణా కేంద్రాలను ధ్వంసం చేశారు. సుమారు 9 ప్రధాన స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఆపరేషన్ అనంతరం భారత్-పాక్ మధ్య మరోసారి కాల్పుల విరమణకు ఒప్పందం కుదరినా ఇప్పుడు పాకిస్తాన్ తిరిగి అదే పాత మార్గాన్ని అనుసరించడం గమనార్హం. భారత మిలిటరీ, ఇంటలిజెన్స్ వ్యవస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం మళ్లీ ఏర్పడింది. పాక్‌కు అంతర్గతంగా ఉన్న అస్థిరతను దాచే ప్రయత్నంలో, ఉగ్రవాదాన్ని మళ్లీ ప్రోత్సహించడం వాస్తవానికి తీవ్ర ప్రమాదాన్ని కొని తెస్తోంది. తానే యుద్ధాన్ని ఆపానంటూ పదేపదే అదే పాట పాడుతున్న అమెరికా అధ్యక్షుడికి ఈ విషయాలేవీ తెలియకుండా ఉండవు. అయినా, ఆయన పాక్? ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌ను పిలిచి మరీ వైట్?హౌస్?లో విందు ఏర్పాటు చేసాడు. మునీర్‌ను గొప్ప నాయకుడిగా కీర్తించాడు. మరోవైపు భారత్?ను పొగుడుతూనే దాగుడుమూతలు ఆడుతున్న ట్రంప్?ను భారత్? పాకిస్తాన్? విషయంలో లెక్కపెట్టాల్సిన అవసరం లేదు. ఇరాన్?లో అణ్వాయుధాలు తయారుచేస్తున్నారని కేవలం ఊహామాత్రంగా తెలిస్తినే దాడులు చేసిన అమెరికా, మా ఆటంబాబులు ప్రత్యేకంగా భారత్? కోసమే తయారుచేసామని మీడియాముఖంగా ప్రకటించిన ఆ దేశ రక్షణమంత్రి మాటలను ఉటంకిస్తూ, భారత్? పాక్?పై దాడిచేసినా ఏమనే పరిస్థితి లేదు. ప్రస్తుతం పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్నా, ఒకసారి ఉగ్రవాద కేంద్రాలు మళ్లీ జీవం పోసుకుంటే కశ్మీర్? మరోసారి అగ్నిగుండంగా మారడం ఖాయం.

## లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

విజయవాడ, వైసిపి హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్ నాయుడులను మూడు రోజులపాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే తమకు ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును సిట్ కోరింది. కానీ వీరిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జులై 1 నుంచి 3వ తేదీ వరకు వీరిద్దరిని సిట్ అధికారులు విచారించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు వీరిని విచారించాలని ఆ ఆదేశాల్లో న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు ఇదే లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అతడు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ లిక్కర్ స్కామ్ కేసులో ఏ 39గా మోహిత్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు జైలు ప్రాంగణంలోని ఆలయానికి ప్రతి రోజు 10 నిమిషాలు వెళ్లేందుకు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే జైల్లో ఉన్న తనకు బయట ఆహారం పంపాలంటూ చెవిరెడ్డి చేసుకున్న అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అలాగే వారంలో మూడు సార్లు ములాఖత్‌లకు చెవిరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

## జెసి ప్రభాకర్ రెడ్డి గుండా రాజకీయం

అనంతపురం, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై జిల్లా ఎస్పీకి వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి ఇచ్చినా తాడిపత్రి లోకి రానీయడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని.. తగిన భద్రత కల్పించాలని రెండు మాసాల కిందటే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రపా.. రపా.. నరుకుతానంటూ జేసీ బెదిరిస్తున్నారని... తనకు మద్దతుగా నిలిచిన వారిపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్.. ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జేసీపై ఎస్పీ జగదీష్‌కు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. హింసకు పాల్పడుతున్న టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ముండమోపి రాజకీయాలు చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడిపత్రిలో ప్రశాంత వాతావరణం ఉండేదన్నారు. ఆఎ÷-టాల్ మున్సిపల్ ఛైర్మన్ జేసీ చెబితే పోలీసులు నడుచుకోవటం హాస్యాస్పదమన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలపై జేసీ ప్రభాకర్ రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఆ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని.. కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి నియోజకవర్గంలోకి వెంటనే అనుమతించాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి లో నియంత పాలన జరుగుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఆంక్షలు ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

## పవన్‌పై కట్టప్ప తిరుగుబాటు.. సత్యరాజ్ కామెంట్లకు అర్థమేంటి?



హైదరాబాద్,పవన్ కళ్యాణ్ వర్సెస్ కట్టప్ప సత్యరాజ్. పవన్ సినిమాలో ఒక పక్క నటిస్తూ.. అదే సమయంలో పవన్‌ని ఇంతగా ద్వేషించడం వెనక కారణాలేంటి? తెలుగులో వరుస సినిమాలు చేస్తూ వస్తున్న సత్యరాజ్ మెగా హీరోల్లో ప్రముఖుడు, రాజకీయ నాయకుడు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి అయిన పవన్‌పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడంలో రీజనేంటి? అసలేంటీ పవనిజం వర్సెస్ కట్టప్ప ఇజం? ఇప్పుడు చూద్దాం.

తెలుగు నాట ఎన్టీఆర్, ఇప్పుడు డిప్యూటీ సీఎంగా పవన్

సత్యరాజ్ అతి పెద్ద పెరియార్ ఫాలోయర్తమిళనాట సినిమాల నుంచి సీఎం అయిన ఎంజీఆర్, తెలుగు నాట ఎన్టీఆర్, ఆ తర్వాత డిప్యూటీ సీఎం అయిన పవన్ కళ్యాణ్ అంటూ.. పవన్ కళ్యాణ్ గురించి గొప్పగా చెప్పారు సత్యరాజ్. హరిహర వీరమల్లులో ఒక పాత్ర పోషిస్తున్న ఆయన.. పవన్ రాజకీయంగా ఇంత పెద్ద స్థాయికి చేరడం తనకు ఎంతగానో సంతోషంగా ఉందంటూ.. కామెంట్ చేశారు కట్టప్పగా తెలుగులో సుపరిచితులైన సత్యరాజ్.

ఉన్నట్టుండి పవన్‌తో రివర్స్ అయిన సత్యరాజ్

అంతా బాగుందనుకుంటున్న తరుణంలో.. సత్యరాజ్ ఉన్నట్టుండి పవన్‌పై రివర్స్ అయ్యారు. ఇందుకు కారణం.. తమిళనాట మురుగన్ మానాడు అని పెట్టిన ఒక సభకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. అక్కడ తమిళ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

మేం పెరియార్ సిద్ధాంతాలు నమ్మే వారం-సత్యరాజ్

ఇదొక ఆధ్యాత్మిక సభ. దీన్నందరూ పాజిటివ్‌గా తీస్కుంటారునుకుంటే పవన్ తో కలసి ఇటీవలే ఒక సినిమాలో నటించిన సత్యరాజ్ సడెన్ గా ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చి సంచలన కామెంట్ చేశారు. %ఎజఖ% అనే పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. మతం పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తే ఇక్కడ కుదరదని అన్నారు. పెరియార్ సిద్ధాంతాలు నమ్మే మమ్మల్ని ఎవరూ మోసం చేసయలేరని అన్నారు. మీరు పాల్గొన్న సభతో మమ్మల్ని మోసం చేశారనుకుంటే అది తెలివి తక్కువ తనమే అవుతుందని.. తమిళ ప్రజలు ఎంతో తెలివైన వారనీ.. మీ ఆటలు ఇక్కడ సాగవంటూ పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి అన్నారు సత్యరాజ్. దేవుడి పేరిట తమిళనాడులో రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా సత్య రాజ్ వైపు అందరి దృష్టి మరలింది.

అధికార డీఎంకేపై విమర్శలు చేసిన పవన్

సత్యరాజ్ ఇంతగా రియాక్ట్ కావడానికి గల కారణం.. పవన్ అధికార డీఎంకే పార్టీపై విమర్శలు చేయడం. నాస్తికులు దేవుడ్ని నమ్మాల్సిన అవసరం లేదనీ. అయితే మన దేశంలో నాస్తికులు హిందువులను ఎంపిక చేసుకుని టార్గెట్ చేస్తుంటారని అనడంతో.. ఈ మొత్తం వివాదం మొదలైనట్టు తెలుస్తోంది.

పవన్ ని పొగిడిన నోటితోనే సత్యరాజ్ విమర్శలు

మొన్నటి వరకూ పవన్‌తో ఎంతో బాగా సఖ్యంగా ఉన్న సత్యరాజ్ ఇంత సడెన్‌గా రివర్స్ కావడానికి గల కారణమేంటి? ఒక సినిమా స్టార్ రాజకీయంగా ఇంత పెద్ద స్థాయికి చేరడాన్ని చూసి సంతోషంగా ఉందన్న నోటితోనే ఇలా తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడమేంటి? రాజకీయంగా ఆయన బీజేపీలాంటి జాతీయ పార్టీతో పొత్తులో ఉన్నారు. దీంతో దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో ఆ పార్టీ ప్రచారాలకు రావడం అన్నదొక భాగం. దాన్ని ఇంత సీరియస్‌గా తీసుకోవడమేంటన్నది చర్చనీయాంశంగా మారింది.

మిర్చి, శంఖం, బాహుబలి వంటి తెలుగు మూవీస్ చేసిన సత్యరాజ్

సత్యరాజ్ తన సెకండ్ ఇన్నింగ్స్ లో.. మిర్చి నుంచి మొదలు పెడితే శంఖం, ఎన్నో తెలుగు సినిమాల్లో నటించారు. అంతే కాదు, ఆయన బాహుబలిలో కట్టప్ప ద్వారా పాన్ ఇండియా లెవల్లో పాపులర్ అయ్యారు కూడా. అంతేనా ఆయన ప్రస్తుతం చెబుతున్న పెరియార్ అనే బయోపిక్ లోనూ నటించారు.

బాహుబలితో పాన్ ఇండియా లెవల్లో పాపులర్

ఒక రకంగా చెబితే సత్యరాజ్ ఇన్ని సినిమాలు చేయడం వేరు బాహుబలి చేయడం వేరు. అప్పటి వరకూ సౌత్ మూవీ ఆర్టిస్టుగానే పరిచయమున్న సత్యరాజ్ బాహుబలితో పాన్ ఇండియా లెవల్లో పాపులర్ చేసింది తెలుగు సినిమా. అంతే కాదు తమిళంతో పాటు తెలుగులోనూ ఆయన తరచుగా చేస్తూ వస్తున్నారు. ఆ మాటకొస్తే ఆయన తాజా తెలుగు చిత్రం పవన్ నటించిన హరిహర వీరమల్లు.

మెగా హీరోల మార్కెట్ వందల కోట్లలో ఉంటాయ్

దానికి తోడు పవన్ కళ్యాణ్ తో పెట్టుకోవడం అంటే సత్యరాజ్ ఒక మెగా హీరోస్ కాంపౌండ్‌తో పెట్టుకోవడమే. ఆయన గతంలో మెగా కాంపౌండ్ హీరో సాయి ధరమ్ తేజ్ మూవీ ప్రతిరోజూ పండగే అనే చిత్రంలో నటించారు కూడా. ఒక పక్క మెగా హీరోలతో యాక్ట్ చేస్తూ మరో పక్క మెగా హీరోల్లోనే రాజకీయంగానూ కీ రోల్ ప్లే చేస్తున్న పవన్ ని ఇంత ఘాటుగా విమర్శించడం అంటే తన మార్కెట్‌ని తనే కోల్పోవడం అన్నది జనసైనికుల మాట. అందుకే పవన్‌తో పెట్టుకున్న వాళ్లు ఇప్పటి వరకూ బతికి బాగు పడ్డట్టు చరిత్రలో లేదంటూ.. సోషల్ మీడియా పోస్టులతో సత్యరాజ్‌ని మాస్ ర్యాగింగ్ చేస్తున్నారు.

పవన్ డీఎంకేని అనడంతో రియాక్టైన సత్యరాజ్?

ఒక రకంగా చెబితే సత్యరాజ్ చేసింది సాహసమే అంటున్నారు కొందరు. ఎందుకంటే చిరంజీవి దగ్గర నుంచి పవన్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ వంటి మెగా హీరోల సినిమాలు ఏటా ఏదో ఒకటి రిలీజ్ అవుతూనే ఉంటాయి. వీటి మార్కెట్ విలువ కొన్ని వందల కోట్ల రూపాయల మేర ఉంటుంది. అలాంటి మార్కెట్ గల హీరోలతో సినిమాలు ఒక పక్క చేస్తూ సత్యరాజ్ ఇలాంటి కామెంట్లు చేయడం వెనక గల కారణమేంటన్నదొక చర్చ. అయితే ఈ ఏడాది జనవరిలో సత్యరాజ్ కుమార్తె దివ్య డీఎంకేలో అధికారికంగా చేరారు. దీంతో ఆయన డీఎంకేకి వ్యతిరేకంగా పవన్ చేసిన కామెంట్లకు రియాక్టయ్యారని అంటారు. అందుకే ఆయన తన సినిమా మార్కెట్‌ని కూడా లెక్క చేయక ఈ కామెంట్లు చేసినట్టుగా భావిస్తున్నారు.

సత్యరాజ్ అతి పెద్ద పెరియార్ ఫాలోయర్

తమిళనాడులో ప్రతి హీరోకి ఒక పార్టీ ఉంటుంది. ఇక్కడ సినిమా రాజకీయం జోడు గుర్రాలు. ఇది ఎంజీఆర్ నుంచి కరుణ, జయలలితతో ఆగలేదు. ఇక్కడ రామరాజ్, కార్తీక్, నెపోలియన్ ఇలా ఎందరో తమిళ కథానాయకులు అయితే ఒక పార్టీ పెట్టడం లేదంటే ఏదైనా ప్రముఖ పార్టీలో చేరడం షరా మామూలు. అలా చూస్తే సత్యరాజ్ మొన్నటి వరకూ కూడా కేవలం సినిమాలే చేస్తూ వచ్చారు. తన కుమార్తె ఎప్పుడైతే డీఎంకే తీర్థం పుచ్చుకున్నారో.. అప్పటి నుంచీ ఆయన పొలిటికల్ కామెంట్లు చేయడం స్టార్ట్ చేశారని అంటారు. దానికి తోడు ఆయన పెరియార్ సినిమా చేయడం మాత్రమే కాకుండా ఆయన ఫాలోయర్ కూడా కావడంతో.. ఇదిగో ఇదీ పరిస్థితి.

త్యరాజ్ చేసిన కామెంట్లకు అర్థమేంటి?

తమిళనాడు రాజకీయాలను ఈ ద్రవిడ వాదం ఎందుకంత ప్రభావితం చేస్తుంది? దీనంతటికీ కారణం ఏమై ఉంటుంది? పెరియార్ ద్రవిడ వాదం అంటే ఏమిటి? సత్యరాజ్ చేసిన కామెంట్లకు అర్థమేంటి? అసలీ ద్రవిడ వాదం ఎప్పటి నుంచీ మొదలైంది? దీని కొనసాగింపు ఎలాంటిది?

ద్రవిడ వాదానికి పెట్టింది పేరు పెరియార్

ముందరకాళ్ల బంధంగా ముందే పవన్ కట్టడితమిళనాడులో.. ద్రవిడ వాదానికి పెట్టింది పేరు పెరియార్. ఇక్కడ ఏదైనా పార్టీ పెట్టాలంటే అందులో ద్రవిడ పదం తప్పనిసరి. అక్కడ ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ పేరు . అంటే ద్రవిడ మున్నేట్ర కళగం అని అర్థం. జయలలిత సీఎంగా అంతకు ముందు ఎంజీఆర్ ముఖ్యమంత్రిగా ఎదిగిన పార్టీ పేరు అన్నా ద్రవిడ మున్నేట్ర కగజం. అక్కడ ద్రవిడ అనే శబద్ధంతో ఉన్న పార్టీలు ఐదు వరకూ ఉండగా.. వాటి పేర్లు వరుసగా డీకే పార్టీ, డీఎంకే, అన్నాడీఎంకే, ఎండీఎంకే, డీఎండీకే. వీటిటిలోని డీ అంటే ద్రవిడ అన్న పదానికి సూచిక.

జస్టిస్ పార్టీతో ఆత్మగౌరవ ఉద్యమం మొదలు

అప్పట్లో కాంగ్రెస్ బ్రాహ్మణ ఆధిపత్య ధోరణిలో ఉండేది కాబట్టి.. ఆత్మగౌరవం కోసం బ్రాహ్మణేతర పార్టీగా అవతరించింది జస్టిస్ పార్టీ. 1917లో మొదలైన ఈ పార్టీ.. ద్వారా ఆత్మగౌరవ ఉద్యమం మొదలైంది. తర్వాత ద్రవిడర్ కగజం, ద్రవిడ మున్నేట్ర కగజం, తమిళ జాతీయ పార్టీ, అన్నాడీఎంకే, ఎండీఎంకే ఇలా ద్రవిడ వాదాన్ని భుజానికెత్తుకుని ముందుకొచ్చిన పార్టీలు చాలానే. వీటిలో ప్రస్తుతం రెండు ద్రవిడ పార్టీలు మాత్రమే పెద్ద ఎత్తున క్రియాశీల రాజకీయాల్లో ఉన్నాయి.

2005లో విజయ్ కాంత్ పార్టీలోనూ ద్రవిడ పదం

2005లో సినిమా స్టార్ విజయ్ కాంత్ ద్రవిడ శబ్ధంతో పెట్టిన పార్టీనే చివరిది. తర్వాత సినిమా నటులు కోవలోంచి వచ్చిన కమల్, విజయ్ కూడా పార్టీలు పెట్టారుగానీ.. ఇందులో ద్రవిడ శద్ధం కనిపించలేదు. కమల్ మక్కల్ నీతి మయ్యం అంటూ తన పార్టీకి నామకరణం చేయగా.. విజయ్ పార్టీ పేరు తమిళ వెట్రి కళగం.

పార్టీలో ద్రవిడత్వం లేకున్నా.. కమల్ మాటలనిండా ద్రవిడ వాదమే

దేశంలో భాషల పరంగా ఆర్య, ద్రవిడ భాషలుగా విడిపోవడం. వాటి ద్వారానే ద్రవిడ వాదం అంటూ ఒకటి పుట్టుకొచ్చింది. వీటి ప్రధాన ఉద్దేశం ఒకటి హిందీని వ్యతిరేకించడం రెండు ద్రవిడ వాదం వినిపించడం. ఈ ద్రవిడ రాజకీయం విజయ్ కాంత్ వరకూ ఎంతో ప్రముఖంగానే సాగింది. కమల్, విజయ్ తమ పార్టీ పేర్లలో ఈ ద్రవిడ పదాన్ని తొలగించడంతో.. ఈ ద్రవిడ ప్రభావం తగ్గిందనే అనుకున్నారంత. అయితే కమల్ హాసన్ పార్టీకి ద్రవిడ పదం లేదన్న మాటేగానీ ఆయన రాజకీయం మొత్తం ద్రవిడత్వంతో ముడి పడి ఉంటుంది. అందులో భాగంగా ఆయన దక్షిణాది భాషా రాష్ట్రాలంతా ఒక్కటై కేంద్రంపై తిరుగుబాటు చేయాలన్న పిలుపునిచ్చారు.

నాన్ ద్రవిడియన్ పార్టీగా పేరు పడ్డ విజయ్ పార్టీ

ఒక రకంగా చెబితే విజయ్ ది మాత్రమే నాన్ ద్రవిడియన్ పార్టీగా చెప్పాల్సి ఉంటుంది. తమిళ స్పీకర్ చెప్పడాన్ని బట్టీ చూస్తే విజయ్ పార్టీ వెనక బీజేపీ ఉందని అంటారు. రజనీకాంత్ ద్వారా సాధ్యం కాని పని విజయ్ ద్వారా నెరవేర్చాలనుకోవడం ఇదే చెబుతుందని అంటారు తమిళనాడు స్పీకర్ అప్పావు.

ద్రవిడత్వంలోని మరో మతలబు స్థానికత

ఇప్పుడు తాజాగా సత్యరాజ్ నోటి వెంట పెరియార్ ద్రవిడ వాదం వినిపిస్తోంది. ఇక్కడ ఎవరెంత హిందుత్వం అవలంభించినా.. రాజకీయంగా మాత్రం అందరిదీ ఒకటే దారి. అదే ద్రవిడ దారి. ఈ దారిలో వారు ప్రయాణించకుంటే ఇక్కడ రాజకీయ మనుగడ కష్టం.

ఈ ద్రవిడత్వంలోని మరో మతలబు స్థానికత. స్థానిక నాయకత్వమే తమిళనాడును పాలించాలన్న కోణంలో మొదలైన ఉద్యమమే ద్రవిడ ఉద్యమం. అణ్ణాదురై నుంచి ఇప్పటి వరకూ తమిళనాడును పాలించిన వారంతా నాన్ కాంగ్రెస్ సీఎంలే. కాంగ్రెస్ ని రాష్ట్ర పాలన నుంచి దూరం చేయడమే ఈ ద్రవిడ రాజకీయం ప్రధాన ఉద్దేశం. అందుకే రజనీకాంత్ తాను ఆధ్యాత్మిక రాజకీయాలను చేయాలనుకుంటున్నట్టు ప్రకటిస్తే ఆయన్ను ఇక్కడి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. శీమాన్ వంటి వారు రజనీని పెద్ద ఎత్తున బెదిరించినట్టు కూడా కనిపించింది.

పవన్ అధికార పార్టీపై కామెంట్ల కాకతో గొడవ

తమిళ ప్రజలకు ఆధ్యాత్మికత, దైవ భక్తి ఎంతో ఎక్కువ. ఇక్కడ అడుగడుగునా వినాయకుడి గుడి కనిపిస్తుంది. కర్నాటకలో లింగాయత్ ఒక మతం ఎలాగో.. తమిళనాట మురుగన్ పై భక్తి కూడా ఒక ప్రత్యేకమైన మతం లాంటిదే. సుబ్రహ్మణ్య స్వామికి చెందిన ఆరు క్షేత్రాలుండేది కూడా తమిళనాడులోనే. అవేంటో చూస్తే.. తిరుప్పరకుండ్రం, తిరుచెందూర్, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళముర చోళై. అందుకే ఇక్కడ మురుగన్ మానాడు అనే సభ నిర్వహించారు.

## పూర్ణచందర్ అమాయకుడని భార్య స్వప్న వ్యాఖ్యలు

హైదరాబాద్, ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు. పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. అయితే, వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. ఞగా, స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్టల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసేది' అంటూ్గ ÷ర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారంకాంగ్రెస్ నేతలు పరిశీలించారు.

# అంచనాలకు అందని ఏపీ,తెలంగాణ బీజేపీ అధ్యక్షుల ఎంపిక



హైదరాబాద్,బీజేపీ తన వ్యూహాత్మక నిర్ణయాలతో ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తూనే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల ఎంపికలో ఈ విషయం మరోసారి ప్రస్ఫుటమైంది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా సీనియర్ నేత ఎన్. రామచంద్రరావును పార్టీ ఎంపిక చేసింది. ఈ రెండు స్థానాల కోసం అనేకమంది పోటీలో ఉన్నప్పటికీ, ఆరెస్సెస్ అండదండలు ఉన్నవారికి, పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగినవారికి, సౌమ్యులకు ఈ బాధ్యతలను అప్పగించింది. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్ష పదవి కోసం విష్ణువర్ధన్ రెడ్డి, భానుప్రకాశ్, డాక్టర్ పీవీ పార్థసారథి, సుజనా చౌదరి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పోటీ పడ్డారు. అయితే, పార్టీ హైకమాండ్ పీవీఎన్ మాధవ్‌ను ఎంపిక చేసింది. ఆరెస్సెస్‌తో సంబంధాలు మాధవ్ ఎంపికకు బలమైన కారణం అయ్యాయి. పైగా ఆయన రెండోతరం బీజేపీ నాయకుడు. ఆయన తండ్రి పీవీ చలపతి రావు బీజేపీ సీనియర్ నేత. గతంలో ఆరేళ్లపాటు ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. మాధవ్ బీసీ నేత కావడం కూడా ఆయనను ఏపీ పార్టీ అధ్యక్షుడిగా బీజేపీ ఎంపిక చేయడానికి మరో కారణం. అన్నిటికీ మించి సౌమ్యుడు. రాజకీయ వివాదాలకు దూరంగా ఉంటారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆ పార్టీలతో కూడా సమన్వయం చాలా అవసరం. ఆ కారణంగానే బీజేపీ అధిష్ఠానం మాధవ్ కు పార్టీ ఏపీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక తెలంగాణలో బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, ఎం. రఘునందన్ రావు వంటి పలువురు నాయకులు పోటీలో ఉన్నారు. అయితే, పార్టీ ఎన్. రామచంద్ర రావును ఎంపిక చేసింది. రామచంద్ర రావు ఆరెస్సెస్ నేపథ్యం కలిగిన నాయకుడు. ఆయన ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించారు. బీజేపీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నేత. రాష్ట్ర రాజకీయాలపై లోతైన అవగాహన ఉంది. పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలున్నాయి. పైగా సౌమ్యుడు. అందరినీ కలుపుకు పోగలరు.

# కొండా కొట్లాట! తగ్గేదెవరు.. నెగ్గేదెవరు?

హైదరాబాద్,కాకతీయుల గడ్డపై కాంగ్రెస్ వర్గపోరుకు బ్రేక్ పడేదెప్పుడు..? పైకి సద్దుమణిగినట్లే కన్పిస్తున్నా పరిశీలించి చూస్తే మాత్రం పరిస్థితి మరింత తీవ్రమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోందట. రెండు వైపులా నేతలు ఎవరికి వారు తగ్గేదేలె అంటుండడంతో రాబోయే రోజుల్లో ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని గుబులు పడుతున్నారట హస్తం నేతలు.

హస్తంలో కాకరేపుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పాలిటిక్స్

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ చైతన్యానికి కేరాఫ్‌గా నిలుస్తుంటుంది. ఇలాంటి చోట కాంగ్రెస్ పార్టీ నుంచి ఎందరో హేమాహేమీల్లాంటి నేతలు ప్రాతినిథ్యం వహించారు. రాష్ట్ర స్థాయిలో తమదైన పాత్ర పోషించడమే కాదు.. హవా నడిపించారు. పార్టీలో కీలక నేతలుగా ఎదిగారు. తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఈ జిల్లాలో.. ఇప్పుడు హస్తం రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి. సొంత పార్టీలోని నేతల మధ్య ఆధిపత్య పోరులో ఎవరిది పైచేయి అవుతుంది.. ఎవరి మాట నెగ్గుతుంది.. ఎవరు తగ్గుతారు అన్నది ఆసక్తినే కాదు అంతకు మించిన ఉత్కంఠను రేపుతోంది.

సొంత పార్టీ ఎమ్మెల్యేలపై కొండా మురళి హాట్ కామెంట్స్

కొండా మురళి వర్సెస్ జిల్లా కాంగ్రెస్‌కు చెందిన మరికొందరు ఎమ్మెల్యేలు అన్నట్లుగా పరిస్థితి తయారు కావడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే.. ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఓసారి పరిశీలిస్తే..ఈ నెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు కొండా మురళి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ సమయంలో ఆయన చేసిన కామెంట్లే కాక పుట్టించాయి. జిల్లా కాంగ్రెస్‌లో విభేదాలకు కారణమయ్యాయి.

కొండా మురళి కామెంట్లపై భగ్గుమన్న ఎమ్మెల్యేలు

కార్యకర్తలు, పార్టీ నాయకుల మధ్య.. సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కడియం శ్రీహరిపై విరుచుకుపడ్డారు కొండా మురళి. ఈ కామెంట్లపై జిల్లా కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు భగ్గుమన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో భేటీ అయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ ఎర్రబెల్లి స్వర్ణ కలిసి కొండా మురళి కామెంట్ల విషయంలో ఏం చేయాలన్న దానిపై చర్చించారు. చివరకు మూకుమ్మడిగా పార్టీ అధిష్టానానికి కొండా మురళి ఎపిసోడ్‌పై కంప్లైంట్ చేశారు. గత కొంత కాలంగా మురళి.. సొంత పార్టీ నేతల్నే టార్గెట్ చేస్తున్నారని.. ఆయన తీరు వల్ల పార్టీ గ్రాఫ్ పడిపోతోందని అభిప్రాయపడ్డారు. పార్టీకి నష్టం చేస్తున్న కొండా మురళి కుటుంబంపై బహిష్కరణ వేటు వేయాలంటూ ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యేలు.

క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన కొండా మురళి

కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న జిల్లాల్లో ఒకటైన ఉమ్మడి వరంగల్‌లో తలెత్తిన విభేదాలపై హైకమాండ్ వెంటనే ఫోకస్ పెట్టింది. జిల్లా నేతల మధ్య నెలకొన్న పంచాయితీకి ఫుల్ స్టాప్ పెట్టాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ పీసీసీని ఆదేశించారు. క్రమశిక్షణ కమిటీ ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో.. ఏం జరగబోతోందన్న ఉత్కంఠతతో ఎదురు చూశారు జిల్లా కాంగ్రెస్ నేతలు. ఈ క్రమంలోనే మల్లు రవి ఆధ్వర్యంలోని క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు కొండా మురళి.



వివరణ ఇచ్చేందుకు బదులుగా రివర్స్‌లో కంప్లైంట్

కానీ, అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి అన్న తీరులో మల్లు రవి ఆధ్వర్యంలోని క్రమశిక్షణా కమిటీ ముందు హాజరైన కొండా మురళి.. జరిగిన అంశంపై వివరణ ఇవ్వడం కంటే.. మరికొందరు నేతలపై ఫిర్యాదు చేశారన్న వాదన బలంగా విన్పిస్తోంది. ప్రధానంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిపై కంప్లైంట్ చేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా సద్దుమణుగుతుందని అంతా భావించిన పంచాయతీ కాస్తా మరింత ముదిరిందన్న అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కొండా మురళి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరు కావడం, వివరణ ఇస్తారనుకుంటే మళ్లీ రివర్స్‌లో కంప్లైంట్ చేయడంపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు హస్తం ఎమ్మెల్యేలు సీరియస్‌గా ఉన్నారట. అసలు మురళి నుంచి వివరణ తీసుకోకుండా.. రివర్స్‌లో కంప్లైంట్ ఎలా తీసుకున్నారని లోలోన రగిలిపోతున్నారట. ఇదే అంశంపై చర్చించేందుకు తాజాగా మరోసారి వీరంతా భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కొండా మురళి అంటే భయమేస్తోందని అందుకే ఫిర్యాదును లైట్ తీసుకున్నారని సెటైర్లు

అసలు ఈ మొత్తం వ్యవహారంలో సొంత పార్టీ నేతలపై లేనిపోని విమర్శలు చేసిన కొండా మురళిపై.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అయితే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారట. కొండా మురళి అంటే భయమేస్తోందని అందుకే ఫిర్యాదును లైట్ తీసుకున్నారని సెటైర్లు వేస్తున్నారట రాజేందర్ రెడ్డి. కొండా ఫ్యామిలీ బీసీ కార్డు అడ్డం పెట్టుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని లేదంటే పరిస్థితి మరోలా ఉండేదని ఆఫ్ ద రికార్డ్‌గా చెబుతున్నారట మరికొందరు కొందరు హస్తం ఎమ్మెల్యేలు. ఎమ్మెల్యేలు, కొండా ఫ్యామిలీ మధ్య నెలకొన్న పంచాయతీ పక్కన పెడితే.. ఇప్పటికే వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ మధ్య వార్ గట్టిగానే నడుస్తోందట. ఇటీవలె భద్రకాళి అమ్మవారికి బంగారు బోనం విషయంలో జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం అంటున్నారు కాంగ్రెస్ నేతలు. ఇలాంటి వేళ.. లేటెస్ట్ పంచాయతీ వ్యవహారంతో నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైందట పరిస్థితి.పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. హస్తిన హైకమాండ్‌కు ఫిర్యాదు చేసేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారన్న టాక్ విన్పిస్తోంది. అయితే.. కొండా మురళి సైతం తమ బలం ఏంటో అందరికీ తెలుసని.. తనను రెచ్చగొట్టొద్దని కామెంట్లు చేయడం ఈ ఎపిసోడ్‌ను మరింత వేడెక్కిస్తోంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ వర్గ పోరుకు ఫుల్ స్టాప్ ఎప్పుడు పడుతుంది అని సగటు కార్యకర్త ఆలోచిస్తున్నాడట.

# నిజంగా అదే జరిగితే గెలుపు గ్యారంటీ అట



అమరావతి,దేవినేని ఉమామహేశ్వరరావు ఆలోచన మారినట్లు కనిపించింది. ఆయన ఇక ఈ టర్మ్ లో ఏ పదవి కోరుకోన్నట్లే కనపడుతుంది. ఏ పదవి తీసుకున్నా తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరమవుతానేమోనన్న భయం పట్టుకుంది. అందుకే దేవినేని ఉమ తన సన్నిహితుల వద్ద చేసిన వ్యాఖ్యలు దీనికి అద్దం పుడుతన్నాయి. దేవినేని ఉమ రాజకీయమంతా టీడీపీలోనే కొనసాగింది. అప్పటి నుంచి ఆయన ఓటమి ఎరగని నేతగా ఉన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 లో ఆయన నందిగామ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2004లోనూ ఆయన నందిగామ నుంచి ఎన్నికయ్యారు. తర్వాత నందిగామ నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంతో పార్టీ అధినాయకత్వం సూచన మేరకు మైలవరానికి షిఫ్ట్ అయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో దేవినేని ఉమ మైలవరం నుంచి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలు కావడంతో దేవినేని రాజకీయం టర్న్ తీసుకుంది.

టిక్కెట్ దక్కకపోయినా...

గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడం అందరికీ ఆశ్చర్యానికి గురి చేసింది. చంద్రబాబు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న దేవినేని ఉమకు టిక్కెట్ రాకపోవడంపై పార్టీలో చర్చ జరిగింది. అలాగని దేవినేని ఉమకు వయసు మించి పోలేదు. సీనియర్ నేతల జాబితాలోకి వయసు పరంగా ఇంకా ఆయన పేరు నమోదు కాలేదు. కానీ టిక్కెట్ రాకపోవడానికి వసంత కృష్ణ ప్రసాద్ కారణమని అంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ లతో నేరుగా మాట్లాడిన వసంత కృష్ణ ప్రసాద్ వైసీపీ నుంచి టీడీపీలో చేరిపోయి మైలవరం టిక్కెట్ తెచ్చుకున్నారు. దేవినేని ఉమ కు పార్టీ అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి ఇస్తారని అందరూ అనుకున్నారు. కానీ కనుచూపు మేరలో కనిపించడం లేదు.

ఏడాది గడిచిపోయినా...

ఏడాది గడిచిపోయింది. దేవినేని ఉమకు పదవి రాలేదు. అలాగని టీడీపీని వీడే ఉద్దేశ్యం కూడా లేదు. 2029 ఎన్నికల్లో తిరిగి మైలవరం నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో నందిగామ రిజర్వ్ డ్ నుంచి సాధారణ నియోజకవర్గంగా మారుతుందని దేవినేని ఆశలు పెట్టుకున్నారు. అందువల్ల ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దక్కదని భావించిన దేవినేని ఉమ మరో నాలుగేళ్లు ఓపిగ్గా ఎదురు చూడాలని నిర్ణయించారు.

# మీనాక్షినటరాజన్ కు 'చేతి' నిండా పని!



హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వ్యవహార శైలి, కాంగ్రెస్ కల్చర్ కు చాలా భిన్నంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ వర్గాల్లో చాలా కాలంగా వినిపిస్తోంది. అవును.. కాంగ్రెస్ నాయకులు, శ్రేణులతో పాటుగా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలలో కూడా మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ కల్చర్ కు భిన్నంగా వ్యహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. నిజానికి.. ఆమె ఎంట్రీనే కాంగ్రెస్ కల్చర్‌కి భిన్నంగా జరిగింది. ఎలాంటి స్వాగత సత్కార్యాలు, మేళతాళాలు, కటౌట్లు, బ్యానర్లు నినాదాలు లేకుండా అలా రైలు దిగి ఇలా నడచుకుంటూ, బసకు చేరి అటు నుంచి నేరుగా గాంధీ భవన్ లోకి ఎంట్రీ ఇవ్వడంలోనే మీనాక్షి నటరాజన్ తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఇక అక్కడి నుంచి ప్రతి పనిలోనూ ఆమె తమ ప్రత్యేకత చాటుకుంటూనే ఉన్నారు. బహుశా ఆమెకు మరే ఇతర బరువు బాధ్యతలు, వ్యాపార, వ్యవహారాలు లేక పోవడంవల్లనో ఏమో కానీ పార్టీ కోసం పూర్తి సమయాన్నికేటాయించి పనిచేస్తున్నారు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో.. ఆ మాట కొస్తే, బీజేపీలో అయినా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అంటే సహజంగా ఏదో అలా చుట్టపు చూపుగా వచ్చి.. వచ్చిన పని చక్క పెట్టుకుని పోవడమే కానీ.. ఇలా రాష్ట్రంలోనే తిష్టవేసి పనులు చక్కబెట్టడం గతంలో అంతగా లేదు. కానీ.. మీనాక్షి నటరాజన్ అలా కాదు. అందుకే.. ఆమె కమిట్మెంట్ తో పనిచేస్తున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అందుకే.. కాంగ్రెస్ శ్రేణులు మీనాక్షి మేడం ప్రత్యేకం అంటున్నారు. అందుకే ఆమె కేవలం ఇన్‌చార్జ్ మాత్రమే కాదు.. అంతకంటే ఎక్కువ అనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఏర్పడింది. అందుకే ప్రభుత్వంలో, పార్టీలో పదవులు కోరుకునే నాయకులు తరతమ బేధం లేకుండా గాంధీ భవన్ కు క్యూకడుతున్నారు. ఆమెను కలుస్తున్నారు. విజ్ఞాపన పత్రాలు ఇచ్చి పోతున్నారు. అయితే.. పరిస్థితి మెల్లమెల్లగా మారుతోంది. ఆమె ఎంత కమిట్మెంట్ తో పనిచేసినా.. పెద్దగా ఫాయిదా లేకుండా పోతోందని పార్టీ నాయకులే పెదవి విరుస్తున్నారు. ఆమె ఎంత స్ట్రిక్ట్ గా ఉన్నా.. ఎంత గట్టిగా గీతలు గీస్తున్నా.. గీత దాటుతున్న నేతల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని అంటు న్నారు. అందుకే.. ఆమెను ఎంట్రీ టైములో మెచ్చుకున్న నాయకులే ఇప్పుడు పెదవి విరుస్తున్నారు.ఏ దో అనుకుంటే ఇంకేదో జరిగింది అన్నట్లుగా పరిస్థితి వుందని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ముందుకంటే ఇప్పుడు మరింత గందరగోళ పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు.ప్రస్తుతం వరంగల్ కాంగ్రెస్ నేతలు మధ్య సాగుతున్న వర్గ పోరు గానీ.. కొద్ది రోజుల క్రితం మహిళా కాంగ్రెస్ నాయకులు, మధ్యలో ఎస్సీ ఎమ్మెల్యేలు, ఆ తర్వాత గొర్రెల మందతో సహా గాంధీ భవన్ ప్రాంగణంలోనే యాదవులు ధర్నాచేయడం వంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో మీనాక్షి నటరాజన్ మీద పెట్టుకున్న ఆశలు మెల్లమెల్లగా ఆవిరై పోతున్నాయని అంటున్నారు. ఇక జిల్లాల్లో పరిస్థితి గురించి అయితే చెప్పుకోనక్కర లేదు. వేదిక పై జిల్లా మంత్రి ఉన్నా మరో నాయకుడు ఉన్నా, పార్టీ సమావేశాలు, చాలవరకు రసాబాసగా ముగుస్తున్నాయి. మొత్తంగా చూస్తే పార్టీలో ముందుకన్నా ఇప్పుడు అంతర్గత కుమ్ములాటలు ఎక్కువ అయ్యాయని అంటున్నారు. మీనాక్షి మేడం ఎంట్రీకి ముందు జిల్లాలకే పరిమితమైన అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు గాంధీ భవన్ కు చేరుకున్నాయి. అలాగే మంత్రి పదవులు మొదలు నామినేటెడ్ పోస్టుల వరకూ పదవులు ఆశించి భంగ పడిన వారు, పదవులు ఆశిస్తున్న వారు గాంధీ భవన్ ని ధర్నాచౌక్ గా మార్చేస్తున్నారని అంటున్నారు. చివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని గట్టి వార్నింగ్ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు సరికదా.. మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ, కొండా మురళీ తాజా ఎపిసోడ్ తో క్రమశిక్షణ కట్లు తెంచుకున్నవైనం కనిపిస్తోందని అంటున్నారు. మరో వంక మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడం, మంత్రుల పని తీరు పట్ల ముఖ్యమంత్రి అసంతృప్తిని వ్యక్తం చేయడం.. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనివార్యం కావడంతో.. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ కు చేతి నిండా పనుందని.. అలాగే అంతర్గత, బహిర్గత రాజకీయం వేడెక్కుతున్న నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ కు చేతి నిండా పని మాత్రమే కాదు, సవాళ్ళూ చాలానే ఉన్నాయని అంటున్నారు. నిజానికి, అసలు టెస్ట్ ఇప్పుడే మొదలైందని అంటు న్నారు.

# తెలంగాణ రైజింగ్! 2047 టార్గెట్‌తో ముందుకు



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి పది శాతం అందేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మధ్యకాలిక లక్ష్యంగా 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఏం చేయాలన్న దానిపై ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఓ రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకుంది.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్..

తెలంగాణకు గ్రోత్ ఇంజన్ అయిన హైదరాబాద్ సిటీని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ హబ్‌గా, AI-Âండీ డేటా సెంటర్లకు, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాలకు గ్లోబల్ సెంటర్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఇందుకోసం అవసరమైన రీతిలో హైదరాబాద్ సిటీలో మౌలిక సదుపాయాలను పెద్దఎత్తున కల్పించాలని భావిస్తోంది. అంతేకాకుండా, హైదరాబాద్‌లో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం చేయాలని తీర్మానించుకుంది.

3వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ..

మూడు వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. ఇందులో %ూ×% సిటీ, స్పోర్ట్స్ సిటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీ, ఫార్మా సిటీ వంటివి భాగంగా ఉంటాయి. ఇది ప్రపంచ స్థాయి నగరాలైన న్యూయార్క్, లండన్, టోక్యో నగరాలతో పోటీపడేలా, కాలుష్యరహిత, కార్బన్-జీరో నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే సబర్మతి, నమామి గంగే ప్రాజెక్టుల తరహాలో మూసీ నదిని పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

మెరుగైన కనెక్టివిటీ కోసం..

రవాణా అభివృద్ధి కోసం హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్ -2 కు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. 201 కిలోమీటర్ల దక్షిణ రీజినల్ రింగ్ రోడ్డు చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మించి హైదరాబాద్‌పై ట్రాఫిక్ ఒత్తిడి లేకుండా చేయడం కూడా ఇందులో భాగమే. ఆర్ఆర్ఆర్ లోపల చిన్నపాటి నూతన నగరాల నిర్మాణాలు చేపట్టాలని రేవంత్ సర్కార్ ఈ విజన్‌లో భాగంగా లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించవచ్చని, తద్వారా తెలంగాణను 3 మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.

మానవ వనరుల, నైపుణ్య అభివృద్ధి కేంద్రంగా..

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో మరో కీలక లక్ష్యం మానవ వనరుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడం. యువతకు ప్రపంచ నైపుణ్యాలను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ఇందుకోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లుగా తీర్చిదిద్దడం, ఐటీఐలలో విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యను అందించడం విజన్ 2047 లక్ష్యాలుగా నిర్దేశించుకుంది. ఇందులోనే మహిళా సాధికారిత సాధించడం మరో లక్ష్యం. స్వయం సహాయక బృందాల్లోని 66 లక్షల మంది మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేయాలని, ఈ లక్ష్యాన్ని 2028లోగా అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సీఎం రేవంత్‌ను ప్రశంసిస్తూ బ్రిటన్ మాజీ ప్రధాని లేఖ

'తెలంగాణ రైజింగ్ విజన్-2047'పై బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల ఢిల్లీలో ఆయనతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టుబడుల సాధన, రైతులు, మహిళలు, యువత సాధికారత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, వాటిని చేరుకునే మార్గాలను టోనీ బ్లెయిర్‌కు రేవంత్ వివరించారు. తర్వాత తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు సంబంధించి 'టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్(టీబీఐజీసీ)'తో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో.. "తెలంగాణ రైజింగ్ విజన్-2047లోని స్పష్టత, నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. లక్ష్యాల సాధనకు ఇండియాలోని టీబీఐజీసీ ప్రతినిధి.. తెలంగాణ ప్రభుత్వానికి అన్నివేళలా సహకరిస్తారు. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అంటూ టోనీబ్లెయిర్ పేర్కొన్నారు.

# శ్రీశైలం లడ్డూ ప్రసాదంలో బొద్దింక ఆరోపణల వెనుక కుట్రకోణం..!

శ్రీశైలం:శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో పంపిణీ చేసే లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందంటూ ఆరోపణలు గుప్పుమన్నాయి.. అయితే, లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందన్న ఆరోపణల వెనుక కుట్రకోణం ఉందంటున్నారు ఆలయ ఈవో శ్రీనివాసరావు..దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిపారు.. అంతేకాదు, శ్రీశైలం పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు.. దేవస్థానం సీసీ టీవీ ఫుటేజీ పరిశీలనతో ఆ కుట్రకోణం వెలుగులోకి వచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.. శ్రీశైలం దేవస్థానంపై దుష్ప్రచారం చేసేలా కుట్రకు పాల్పడ్డారని ప్రభుత్వానికి ఈవో నివేదిక ఇచ్చారు..అయితే, లడ్డూ ప్రసాదం విషయంలో కుట్రకు పాల్పడ్డ అంశంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది.. వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.. సున్నితమైన అంశాల్లో రెచ్చగొట్టే విధంగా కుట్రలకు పాల్పడిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోండంటూ స్పష్టం చేసింది ప్రభుత్వం.. కుట్రలకు పాల్పడిన వారి స్పష్టం కాగా.. వారి వెనుక ఎవరున్నారనే అంశం పైనా ఆరా తీయాలని స్పష్టం చేసింది సర్కార్.. అయితే, లడ్డూ ప్రసాదంలో బొద్దింకంటూ కుట్రపూరితంగా గొడవకు దిగాడట కావలికి చెందిన శరత్ చంద్ర.. ఈ కుట్రపై శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈవో..శ్రీశైలం ప్రసాదంలో బొద్దింక ఆరోపణలపై ఈవో శ్రీనివాసరావు.. ప్రభుత్వానికి అందించిన నివేదికలోని అంశాల విషయానికి వస్తే.. లడ్డూ ప్రసాదంలో బొద్దింక లేదు.. కావాలని ఓ మిడతను చొప్పించారు.. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన ద్వారా లడ్డూ ప్రసాదంలో బొద్దింక అంశం వెనుక కుట్ర ఉందని తేలిందని పేర్కొన్నారు.. లడ్డూలు కొనుగోలు చేసి అందులో మిడతను పెట్టినట్టు ఆధారాలు లభ్యమయ్యాయి.. మిడతను కలిపిన లడ్డూ ప్రసాదాన్ని చూపుతూ బొద్దింక వచ్చిందంటూ గొడవ పెట్టుకున్నట్టు గుర్తించామని ఈవో తెలిపారు..



Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.